క్లుప్తంగా

విస్తృత స్థాయి సమావేశ ఏర్పాట్ల పరిశీలన



మరికల్: మండల కేంద్రంలోని వైఎస్ పంక్షన్ హాల్‌లో శనివారం జరిగే బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశానికి అధిక సంఖ్యలో పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు తరలివచ్చేందుకు మండల నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు ఎంపీ అభ్యర్థి మన్నెం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతయ్య, కృష్ణారెడ్డి, బసంత్, శ్రీను, రామస్వామి, జగదీష్, రాములు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా బీటీ రోడ్డు



మాగనూర్: మండల కేంద్రం నుంచి వర్కూర్‌కు వెళ్లే బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు మార్గంలో చాలా చోట్ల కంకర తేలి, గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో ఇప్పటికే చాలా మంది ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత స్పందించి, బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

16న మండల సర్వసభ్య సమావేశం

మాగనూర్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ శ్యామలమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు శాఖల వారిగా నివేదికలతో హాజరు కావాలన్నారు.

నేడు కార్యకర్తల సన్నాహక సమావేశం

కృష్ణా: మండలంలోని హిందుపూర్‌లో బసవేశ్వర కల్యాణ మండపంలో శనివారం ఉదయం 9గంటలకు బీఆర్ఎస్ ఉమ్మడి మాగనూర్, కృష్ణా మండలాలకు చెందిన కార్యకర్తల సన్నాహక సమావేశానికి మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఉమ్మడి మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి తెలిపారు.శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా పార్లమెంట్ సభ్యులు మన్నె శ్రీనివాస్‌రెడ్డితోపాటు మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, రాజేందర్‌రెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ కార్యకర్తలు, పార్టీ ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సీజ్ చేసిన ఇసుక తరలించరా?



మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్‌లో కొందరు వ్యక్తులు గతకొన్ని రోజుల కిందట ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గ్రామ శివారులో భారీ మొత్తంలో ఇసుక అక్రమ డంప్‌లు చేశారు. అయితే విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది డంపులను గుర్తించి సీజ్‌చేశారు. ఇసుక సీజ్‌చేసి నెలలు గడుస్తున్నా అక్కడి నుంచి తరలించకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక డంపులను తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీలో భారీగా చేరికలు

పాలమూరు: జిల్లా కేంద్రంలోని తిమ్మాసానిపల్లిలో శుక్రవారం మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ సమక్షంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు భారీగా బీజేపీలో చేరారు. అంతకు ముందు ఆమె నివాసంలో కొత్తగంజ్, పెద్దదర్పల్లి, దొడ్డలోనిపల్లికి చెందిన ఇతర పార్టీల కార్యకర్తలు, మహిళలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని, దేశంలో 400 సీట్లు గెలవబోతున్నామని అందులో పాలమూరు సీటు పక్కా అన్నారు.

ఇళ్లు వచ్చేనా?

- ప్రభుత్వ ఇళ్లకోసం ఎదురుచూపులు
- పస్పులలో 32ఏళ్ల క్రితం ఇళ్లకు పట్టాలు
- ప్రభుత్వ హామీలే తప్ప అమల్లో శూన్యం



పస్పులలో ప్రభుత్వ ఇళ్లకు ఎంపికైన స్థలం

మరికల్: ప్రభుత్వాలు మారుతున్న అర్హులైన పేదలకు ఇళ్లురావడం లేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందే తప్ప గత ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి కూడా ఒక్క ఇళ్లు మంజూరు చేయకపోవడంతో అర్హులు ఇళ్లకోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. మండలంలోని పస్పులలో 32ఏళ్ల క్రితం అర్హులైన లబ్ధిదారులకు అప్పటి ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు సంబంధించి పట్టాలు ఇచ్చింది. గత ప్రభుత్వం ఆ గ్రామాన్ని డబుల్ బెడ్రూం కింద ఎంపికచేసి పదేళ్ల పరిపాలన చేసి మొండిచేయి చూపడంతో కొత్త ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.

పట్టాలు ఎప్పుడు ఇచ్చారు..

మండలంలోని పస్పులలో ఇళ్లులేని అర్హులైనా 65మంది లబ్ధిదారులను గుర్తించి 1991లో అప్పటి ప్రభుత్వం సర్వే నంబర్ 211లోని మూడు ఎకరాల 19గుంటల స్థలంలో 65మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 135చదరపు గజాల చొప్పున ప్లాట్లను పంపిణీచేసి పట్టాలను అందజేశారు. కాని హద్దులు చూపించకపోవడంతో 32ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. పస్పులలో అర్హులైనా లబ్ధిదారులకు అందజేసినా బీసీ కాలనీలో గత ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇళ్లను నిర్మించేందుకు పదేళ్ల క్రితం పస్పులతోపాటు మరికల్, మందిపల్లి ఇళ్లను నిర్మించేందుకు నిర్ణయించింది. కాని ఇళ్లకు పూనాది పడలేదు. దీంతో లబ్ధిదారుల నిరీక్షణ రోజు.. రోజుకు పెరుగుతునే ఉంది. ప్రభుత్వ ఇళ్లకోసం ఎదురుచూడలేక కొందరు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నా వారు ఉన్నారు.

ఇళ్లను మంజూరు చేయాలి



32ఏళ్ల క్రితం అర్హులైనా లబ్ధిదారులకు అందజేసిన బీసీకాలనీ స్థలంలో కొత్త ప్రభుత్వమైన ఇళ్లను నిర్మించి తమకు గూడు కల్పించాలి. ఇళ్ల కోసం ఇన్నాళ్లుగా ఎదురుచూపులే తప్ప నిర్మాణాలు జరగడం లేదు. ఎమ్మెల్యే స్పందించి తమ గ్రామంలో అర్హులను ఎంపిక చేసిన వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి. - నర్సింహులు, పస్పుల

పేదలకు న్యాయం జరగాలి..



తమ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ ఇళ్లను మంజూరు చేసేందుకు దశాబ్దాల నుంచి ప్రయత్నం చేస్తున్నాం. అయిన సాధ్యం కావడం లేదు. ప్రస్తుత ప్రభుత్వమైన తమ గ్రామంలో ఉన్న పేదలకు ఇళ్లను నిర్మించి అందజేయాలి.

- తిమ్మయ్యగౌడ్, పస్పుల

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాలి

ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయం రాలేదు. ఒక వేళ ప్రభుత్వం ఆదేశాలు జారీచేస్తే ఇళ్ల మంజూరుకు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తాం.

- సునీత, తహసీల్దార్, మరికల్

కాంగ్రెస్ విజయం కోసం కృషిచేయాలి



మండల ఇన్‌చార్జి బంగ్లాలక్ష్మికాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఊట్కూరు: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దామని మండల ఎన్నికల ఇన్‌చార్జి బంగ్లా లక్ష్మికాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో పగిడిమారి, బిజ్వార్ తదితర గ్రామాల్లో పర్యటించారు. బిజ్వార్‌లో సీపీఐఎంఎల్ నాయకులతో కలిసి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేర్చేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి కాంగ్రెస్ విజయం కోసం కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు మండల ఇన్‌చార్జిగా నియమించడంపై ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్కోటి నారాయణరెడ్డి, మణెమ్మ, ప్రకాష్‌రెడ్డి, బసవరాజు, మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన



ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మించిన సరస్వతీ దేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం వైభవంగా కొనసాగాయి. తెల్లవారుజామున అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దంపతులతో పూజారులు హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అఖిలపక్ష పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ మతతత్వ విధానాన్ని ఎండగట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతతత్వ విధానాలను అవలంబిస్తూ.. ప్రజల మధ్య దూరం పెంచుతుందని వామపక్ష పార్టీ నాయకులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో వామపక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్, సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, సీపీఐ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి రామచందర్ హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, అందుకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటం చేయాల్సి ఉందన్నారు. బీజేపీ వైఖరిని ఎండగట్టేందుకు వామపక్ష పార్టీలు ఒక్కతాటిపైకి వచ్చి పోరాటం చేస్తామన్నారు. అందులో భాగంగా శనివారం సీఐటీయూ కార్యాలయంలో వామపక్ష పార్టీల జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ సదస్సుకు సీపీఎం రాష్ట్ర నాయకుడు భూపాల్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బలమల్లేష్, ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కృష్ణ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వివరించారు.

దాయాదుల మధ్య ఘర్షణ: కేసు నమోదు

అమరచింత: ఇంటి ఎదుట బాత్‌రూం నిర్మాణ సమయంలో రెండు ఫీట్ల స్థలాన్ని కాజేశాడంటూ తనపై హన్మంతు అనే వ్యక్తి దాడిచేసి గాయపరిచాడని నాగల్‌కడ్మూర్‌కు చెందిన రవీందర్ ఫిర్యాదు చేశాడని ఎస్ఐ సురేష్ కుమార్ తెలిపారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌కు చెందిన రవీందర్, హన్మంతు దాయాదులు. రవీందర్ ఇంటి నిర్మాణ సమయంలో బాత్‌రూం కట్టేందుకు తనకు సంబంధించిన రెండు పీట్ల స్థలాన్ని వాడుకున్నాడని హన్మంతు శుక్రవారం వాదనకు దిగాడు. ఇరువురి మధ్య మాటమాట పెరగడంతో హన్మంతు రవీందర్‌పై కర్రతో దాడి చేయగా.. తలకు బలమైన గాయం అయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రధాని మోదీ పాలనపైనే ప్రజలకు నమ్మకం



ఆత్మకూర్ నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న బీజేపీ నాయకులు

ఆత్మకూర్: దేశ ప్రజలకు ప్రధాని మోదీ పాలనపైనే నమ్మకం ఉందని, ఆయనతోనే దేశాభివృద్ధి సాధ్యమని భారతీయ జనతా పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌లో కార్యకర్తలతో కలిసి మహబూబ్‌నగర్ సభకు తరలివెళ్లారు. బూత్ స్థాయి అధ్యక్షుల సమావేశానికి పెద్ద ఎత్తున ఆత్మకూర్ నుంచి వెళ్తున్నామన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని, నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రి అవ్వడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తమ్మలి విజయ్, ఆనంద్‌కుమార్, బాలకృష్ణ, చిన్న నర్సింహ, రేచింతల శ్రీను, రాజు, ఎల్లన్న, బాలు, వెంకట్రాములు, విష్ణువర్ధన్‌రెడ్డి, సూరి, అశోక్, చందు, శ్యాం, లక్ష్మినారాయణ, తదితరులు ఉన్నారు.

జితేందర్‌రెడ్డికి సన్మానం



మహబూబ్‌నగర్ క్రీడలు: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర క్రీడలశాఖ సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డిని శుక్రవారం జిల్లా కేంద్రంలో పలు క్రీడాసంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను పూలమాలలతో సత్కరించారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శరత్‌చంద్ర, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధి సాధిక్‌అలీ పాల్గొన్నారు.

20 నుంచి హెచ్‌సీఏ వేసవి క్రికెట్ శిబిరాలు



మాట్లాడుతున్న ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్

మహబూబ్‌నగర్ క్రీడలు: గ్రామీణ ప్రాంతాల్లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి వచ్చే నెల 20 వరకు వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (ఎండీసీఏ) ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ తెలిపారు. జిల్లా కేంద్రం పిల్లలమర్రి సమీపంలోని క్రికెట్ మైదానం పెవిలియన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో ఐదు వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మహబూబ్‌నగర్‌లోని క్రికెట్ మైదానం, గద్వాలలోని డీఎస్ఏ మైదానం, జడ్చర్లలోని డిగ్రీ కళాశాల మైదానం, కల్వకుర్తిలోని డీఎస్ఏ మైదానం, నాగర్‌కర్నూల్‌లోని జెడ్పీహెచ్ఎస్ మైదానంలో వేసవి శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఈ శిక్షణ కేంద్రాల్లో నిష్ణాతులైన కోచ్, ట్రైనర్ ఉంటారని, అదే విధంగా క్రీడాకారుల కోసం మ్యాట్‌లు, నెట్‌లతోపాటు జంబో కిట్‌లు అందుబాటులో ఉంచుతామన్నారు. ఉదయం 5.30 నుంచి 8.30 గంటల వరకు కోచింగ్ ఉంటుందని, క్రీడాకారులకు అల్పాహారం అందిస్తామన్నారు. ఆసక్తిగల అండర్- 10 నుంచి అండర్- 23 ఏళ్లలోపు క్రీడాకారులు ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు ఆయా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

టీడీఎల్‌లో అవకాశం..

వేసవి శిబిరాల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు వచ్చే నెల 20వ తేదీ తర్వాత హెచ్‌సీఏ ఆధ్వర్యంలో జరిగే తెలంగాణ డిస్ట్రిక్ట్ లీగ్ (టీడీఎల్) టీ-20 లీగ్‌లో అవకాశం లభిస్తుందని రాజశేఖర్ చెప్పారు. ఐదు శిబిరాల క్రీడాకారులకు మ్యాచ్‌లు నిర్వహించి ప్రతిభ క్రీడాకారులతో ఈ లీగ్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా సీనియర్ జట్టును ఎంపిక చేస్తామన్నారు. అలాగే హెచ్‌సీఏ టోర్నీలకు ఎంపిక చేస్తామని, రాణించే క్రీడాకారులకు హెచ్‌సీఏ టాలెంట్ హబ్ అకాడమీల్లో అవకాశం దక్కుతుందన్నారు. వేసవి శిక్షణ శిబిరాలను ఔత్సాహిక క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, వెంకటరామారావు, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఈద్ మిలాప్

మక్తల్: ఈద్ మిలాప్ మత సామరస్యానికి ప్రతీకని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం పట్టణంలోని రాయచూర్‌రోడ్‌లో ఉన్న మదర్సా ఫైజుల్ ఉలామ్‌లో ఈద్ మిలాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.. అన్నిమతాలకు చెందిన వ్యక్తుల మధ్య సోదరభావాన్ని, మతసామరస్యాన్ని పెంచేవిధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మతాలు, కులాలు వేరైనా తామంతా ఒక్కటేనని అందరూ కలిసి మెలసి ఉండాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి మౌలానా అలీం కౌసర్, నాసిర్ బన్ ఉమర్ చాహుస్, ఇబ్రహీం, రవికుమార్, కల్లూరి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు నగదు అందజేత



విజేతకు ట్రోఫీతోపాటు నగదు అందజేస్తున్న నిర్వాహకులు

మద్దూరు: నెలరోజులపాటు నిర్వహించిన ప్రీమియర్ లీగ్ విజేత మద్దూరుకు చెందిన డీవీఆర్ టీం గెలుచుకుంది. మద్దూరులోని గత నెల 15న ప్రీమియర్ లిగ్ పోటీని నిర్వాహకులు రామకృష్ణ, నాగరాజు, తలారీ నరేష్, పిల్లగంట్ల బుజ్జి, వీరితోపాటు దార్‌కర్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌కు మండలంలోని 10టీంలు పాల్గొన్నాయి. ఒక్కో టీం దాదాపు 10మ్యాచ్ ఆడాయి. శుక్రవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో మద్దూరుకు చెందిన డీవీఆర్ టీం, భీంపూర్‌కు చెందిన వారియర్ టీంలో తలపడగా హోరాహోరి మ్యాచ్‌లో మూడు రన్‌ల తేడాతో డీవీఆర్ టీం గెలుపొందింది. విజేతకు రూ. 51వేల నగదుతోపాటు ట్రోఫిని, రన్నరఫ్‌కు రూ. 25వేల నగదుతోపాటు ట్రోఫిని నిర్వాహకులు అందజేశారు. దార్‌కర్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. గణపతి రవి, రామకృష్ణ, చందు, మహేష్, ప్రకాష్, శాంతుకుమార్, నర్సింహారాజు, రాజు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మక్తల్: హమాలీ కార్మిల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని ఎఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలోని శుక్రవారం ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి హమాలి కార్మికుడు లక్ష్మణ్ అధ్యక్షతన వహించారు. ఈ మేరకు.. వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్నటువంటి హమాలీ కార్మికులకు ప్రభుత్వం ఎలాంటి చట్టాలను అమలు చేయడం లేదని, కార్మికులు ప్రమాదాల బారిన పడిన బీమా సౌకర్యాలు కూడా కల్పించలేదన్నారు. కూలీ గిట్టుబాటు కాక కార్మిక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా కార్మికులకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకొని తదనంతరం కార్మికుల గురించి ఆలోచించడం మానేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్. కిరణ్, భగవంతు, భుటో, భాస్కర్, ఆనంద్, నాగప్ప, రాజు, మోహన్‌రెడ్డి, అంజి పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



మూలమళ్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న వెంకటేష్

ఆత్మకూర్: ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నందున వడదెబ్బ తగులకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని గ్రామీణ వైద్యుడు వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆత్మకూర్ మండలంలోని మూలమళ్లలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను లీటరు నీటిలో కలిపి నిత్యం తాగాలని సూచించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా బయటకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా గొడుగు, వాటర్‌బాటిల్ తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఆశాకార్యకర్తలు, గ్రామపెద్దలు నారాయణరెడ్డి, నర్సింహారెడ్డి, ఎల్లన్న, రాంరెడ్డి, ఫీల్డ్‌అసిస్టెంట్ అరుణ, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు పరిశీలన



మర్లులోని ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థలోని మరుగుదొడ్లను పరిశీలిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 57 ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు ఆయా శాఖల అధికారులు శుక్రవారం పరిశీలన జరిపారు. ఇందులో ఏ పాఠశాలలో ఏయే పనులు చేపట్టాలో ఈపాటికే అమ్మ ఆదర్శ కమిటీలు అధికారులకు నివేదించాయి. దీంతో అన్ని ఇంజినీరింగ్ విభాగాల అధికారులు ఈ పాఠశాలల్లో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆయా పనులకు ఎంత ఖర్చు అవుతుందో ఎక్కడికక్కడే అంచనాలు రూపొందించారు. ఇక వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభయ్యేలోగా పూర్తి చేయనున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.జయశ్రీ, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఎంఈ యు.బస్వరాజ్, ఏఈ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారామ సమేత విగ్రహ ప్రతిష్ఠాపన



నల్లగుట్టతండాలో ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహం



ఆలయంలో సాయిబాబా విగ్రహం

బాలానగర్: మండల పరిధిలోని ఉడిత్యాలలో సీతారామ సమేత లక్ష్మణ, ఆంజనేయస్వామి, కుమార స్వాముల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామస్తులు అందరూ కలిసికట్టుగా చేసుకునే పండుగలతో గ్రామంలో ఒకరికొకరి సహకారాలు, సోదరభావాలు పెంపొందుతాయని, మన గ్రామం అనే ఆలోచనలు పెంపొందుతాయని అన్నారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో గణపతి హోమంలో పలువురు జంటలు పాల్గొన్నారు. ఉడిత్యాలలో మూడు రోజులుగా జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన

భూత్పూర్: మున్సిపాలిటీలోని 1వ వార్డు నల్లగుట్ట తండాలో శుక్రవారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వార్డు కౌన్సలర్ బాల్‌కోటి ఆధ్వర్యంలో గణపతి, కుమారస్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాలకు జలాధివాసం, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి విగ్రహం ప్రతిష్ఠించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

నేటి నుంచి షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం గణేష్‌నగర్‌లోని షిర్డీ సాయి దేవాలయంలో శనివారం నుంచి 16వ వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త పద్మజా గోపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. తొలి రోజు స్వామివారి అభిషేకంతో వార్షికోత్సవ పూజలు ప్రారంభమవుతాయి. 14న ఉదయం గణపతి పూజ, అంకుర్పారణ, సుప్రభాత సేవ, కాగడ హారతి, విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, మండపారాధన, సాయంత్రం సంధ్యాహారతి, నవగ్రహ హోమాలు నిర్వహిస్తారు. 15న ఉదయం సుప్రభాత సేవ, కాగడహారతి, 21 కలశాలతో స్వామి వారికి అభిషేకం, దత్తాత్రేయ మహామంత్ర సాయి మూల అనుష్టాన హోమాలు, కుంబాభిషేకం, పూర్ణాహుతి పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం వైభవంగా స్వామివారి పల్లకీసేవ నిర్వహించనున్నారు. పూజల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

రైతు సేవా కేంద్రం ప్రారంభం



దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలో శుక్రవారం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంఆర్పీ ధరలకే రైతులకు ఫర్టిలైజర్స్, సీడ్స్, పెస్టీసైడ్స్‌లు రైతు సేవా కేంద్రం ద్వారా లభిస్తాయని దుకాణం యజమానులు తెలిపారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కిషన్‌రావు, మాజీ సర్పంచ్ స్వప్న, శ్రీకాంత్, నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.